

CHENNAPPA NĀNĪLU

by

Dr. M. Chennappa

[illegible]

[illegible]

చెన్నప్ప నానీలు



డా॥ మసన చెన్నప్ప

చెన్నప్ప నానీలు

డా|| మసన చెన్నప్ప

ప్రమీల ప్రచురణలు
హైదరాబాద్
2005

CHENNAPPA NĀNĪLU

(Epigrams)

by

Dr. M. CHENNAPPA

First Published: 2005

Price : **Rs. 35/-**

Cover Page : **SHRESHTA**

For Copies

1. **Pramila Prachuranalu**
   "SHRESHTARAMAM"
   9-76/2, Udaynagar Colony
   Boduppal, Hyderabad- 500 039
   Phone : 040-27201007
2. **V isalandhra Publishing House**
   4-1-435, Bank Street, Vignan Bhavan
   Hyderabad - 500 003, And its all Branches
3. **Nav oday a Book House**
   Kachiguda, Hyderbad

Type Setting
Smt K. Saraswathi
303, North Block, Dream Home Shalivahana Towers
Shalivahana nagar, Moosarambagh, Hyderabad-36
Phone : 040-55367452

Printed at
Mounika Graphics
1-4-27/71/187, P.S. Colony
Hyderabad -500 080
Phone: 9391041545

అంకితం



సుమధుర భాషణులు
సుకవిజన తోషణులు
పదకేళీవినోద పాత్రులు
నాకు మంచి మిత్రులు
శ్రీ పి. నరసింహులు
గారికి
అంకితం ఈ నానీలు

బలమైన నానీకారుడు

-డా॥ ఎన్. గోపి

నానీలు ఆవిర్భవించి అప్పుడే ఎనిమిదేళ్లయ్యింది. వాటి పుట్టుక నుంచి ఎందరో ఈ ప్రక్రియలో రాశారు. అనుసరించారు అని అనను. ఈ కవితారూపాన్ని ఎన్నుకున్నారు. నానీల్లో ఎవరి గొంతులు వారివే. నానీ మాత్రాఛందోరూపం కాదు. ఇది వచనకవిత. చెప్పవలసి వస్తే ఇది వచనకవితలో భాగమే. సైజును బట్టి మాత్రమే మినీకవిత కాదు. మినీ కవిత లక్షణాలను బేరీజు వేస్తూ విమర్శకులు ఆ రోజుల్లో బాగానే రాశారు. ఢిల్లీలో నానీల హిందీ అనువాదం ఆవిష్కరణ జరిగినప్పుడు హిందీ సాహితీవేత్తలు నానీకి తెలుగులో పాడే గుణముందా అని అడిగారు. లేదన్నాను. అయితే దీనిలో ఏదో నిర్మాణసంబంధమైన అమరిక ఉండి ఉండాలి అన్నారు. హిందీలో అక్షరసంఖ్య లేదు. నాలుగు పాదాల నియమం వుంది. నాలుగు పాదాలకు హేతుబద్ధత ఏమీ లేదు. నాలుగు పాదాలు మన సంప్రదాయం. అంతేనా! అంతేకాదు. అర్థం ప్రకారమో, భావం ప్రకారమో వాటిని విరుచుకొని వాడుకోవాలి. నాలుగు పాదాలనేవి దృశ్యవిభజన కాదు. శ్రవణ విభజన. ఎన్నో సభల్లో నానీల పఠనానికి ప్రశంసలు మోగటానికి కారణం ఇదే. గణాలు, మాత్రల నియతి లేకుండా అక్షర నియతి ఏమిటి? అని కొందరికి సందేహం కలగొచ్చు. మన వృత్తాల్లో గణసంఖ్యా అక్షర సంఖ్యా నియతం. అందుకే బ్రౌన్ వాటిని fixed meters అన్నాడు. ఆటవెలది, తేటగీతిలాంటి ఉపజాతుల్లో వెసులుబాటు (Choice) వుంటుంది. నానీల్లో వెసులుబాటు ఇలాంటిదే. మాత్రలకూ గణాలకూ అక్షరసంఖ్యకూ తార్కిక సంబంధం ఏమీ లేదు. భావాల్లో లయ, పదాల కూర్పులో లయలాంటివి, అన్నింటినీ మించి మిక్కుటమైన కవితాశక్తి ఒక నిర్మాణాన్ని ఆకర్షవంతం చేస్తాయనుకుంటాను.

చెన్నప్ప నానీలకు రెండు మాటలు చెప్పమంటే లక్షణచర్చలోకి వెళ్లిపోయాను. ఎందుకంటే డా॥ మసన చెన్నప్ప గట్టి పండితుడు. గత

పాతికేళ్లుగా అధ్యయన అధ్యాపనాల్లో మగ్నమై ఉన్నవాడు. అనేక గ్రంథాలు రచించినవాడు. నానీలు అతని భుజంపై వాలి అల్లరిపెట్టి అతని చేత కూడా రాయించిన సందర్భం నన్ను చర్చాచాపల్యంలోకి లాగి వుంటాయి.

డా॥ చెన్నప్ప పాతికేళ్లుగా నాకు తెలుసు. మాట్లాడుతుంటే గలగలా గోదారి. మంచి భావుకుడు, సహృదయుడు. ఒక చతురోక్తో, ఛలోక్తో, చమత్కారమో లేకుండా అతడు మాట్లాడడు. సద్యఃస్ఫూర్తి, సమయస్ఫూర్తితో అతడు వేదికలను వెలిగిస్తాడు. ఈ నేపథ్యంలో నేనోసారి అన్నాను. 'నువ్వు గొప్పగా మాట్లాడుతావు. మాట్లాడుతుంటే కవిత్వం దొర్లిపడుతుంటుంది. ఇవన్నీ గాలికి పోవలిసిందేనా? విస్తృతంగా కవిత్వం రాయకూడదా?' అని. నవ్వి ఊరుకునేవాడు. ఎందుకంటే ఆయన ఆధ్యాత్మికంలో పడ్డాడు. ఉపనిషత్తులను అవలోధనం చేస్తూ ఆంధ్రానువాదంలో పడ్డాడు.

హఠాత్తుగా ఓ రోజు నానీలు అతని ద్వారం తట్టాయి. అవి అతన్ని ఊరుకోనీయలేదు. ఫలితంగా ఓ వారం రోజుల్లోనే ఈ నానీలు.

చెన్నప్ప నానీల్లో చమత్కారం, ఆధ్యాత్మికత, లోకవృత్తపరిశీలన, సామాజికాంశాలు ఉన్నాయి. ఎక్కువ నానీల్లో కవితాత్మకత అనివార్యం.

"కడుపులో వున్నప్పుడు తంతే
బాధలేదు
బయట వుండి తంతేనే
నరకం."

కొట్టడం కొట్టడమే sixer కొట్టాడు చెన్నప్ప. ఇందులో సంతానాన్ని కనకముందు, కనిపెంచిన తరువాత ఉన్న బాధాకరమైన వ్యత్యాసం గుండెను తాకుతుంది. కనకముందు కడుపులో వున్నప్పుడు శిశువు తన్నే తన్ను గర్భిణికి తియ్యని బాధే. కాని రెండోది నరకం అంటున్నాడు కవి.

"ప్రేమికులు
ఎండలో మాట్లాడుకుంటున్నారు

ఎండ
వారి జోలికి వెళ్లదు."

ఎండే కాదు, ఏదీ వారి జోలికి వెళ్లలేదు. వెళ్లినా వారి సమాధి భగ్నం కాదు.

"కొడుకు
బొంగరంలా తిరుగుతున్నాడు
జాల ఏమిటి?
నిరుద్యోగం."

దీని వ్యాఖ్యానానికి పూనుకుంటే ఈ నానీ ఓ జాలగా మారి మనల్ని తిప్పుతుంది. 'నిరుద్యోగం' అనేది ఓ punch. దీనితో ఈ నానీ వెలిగింది.

"వాన రాకపోతే
కన్నీరా?
జాగ్రత్త
అవి కూడా అయిపోయేను."

నిన్నటిదాకా మనం ఎంత నీటికొరతను ఎదుర్కున్నామో గుర్తుందా?

చెన్నప్ప గుండేరావు హర్కారేవంటి గొప్ప సంస్కృత పండితుని దగ్గర శిష్యరికం చేయడమే కాక ఇతరత్రా బోలెడన్ని తాత్త్వికలోకపు లోతుల్ని ముట్టాడు.

"అద్వైతీ అద్వైతీ
అంటావు
మరి
ఇంకెందుకు వేంకటపతీ!" అని చురక వేస్తాడు. చెప్పేది అద్వైతం, ఆచరణలో ద్వైతమా అని ప్రశ్నిస్తున్నాడు.

"ముట్టుకుంటే
రోగాలు నయమవుతాయా?
ఇదెక్కడి
స్పర్శా సిద్ధాంతం."

ఎంతో సాంకేతికాభివృద్ధి జరుగుతున్న కాలంలో కూడా దానికి ధీటుగా మూఢనమ్మకాలు పెరుగుతున్నాయి. 'స్పర్శా సిద్ధాంతం' ఏమి ప్రయోగం? 'ఏకవీర' నవలలో విశ్వనాథ స్పర్శాసిద్ధాంతం గుర్తుందా? నిత్యజీవితంలో ఉటంకించుకోదగిన నానీలెన్నో చెన్నప్ప రాశాడు.

"పరీక్షల్లో
ఫెయిలయ్యావా
ఇంకేం
రాజకీయాల్లో పైకొస్తావు."

"నువ్వు ఒంటరివని
ఎవరన్నారు?
నీతో
పరమాత్మ ఉన్నాడుగా"

"నేను
కష్టాల్లో వున్నాను
ఈ దెబ్బతో
మిత్రులెవరో తేలిపోతుంది."

ఇక ఆపుతాను. బుట్టలోని పండ్లన్నీ నేనే ఖాళీ చెయ్యడం భావ్యం కాదు.

నానీలు రాయడం 'కవిత్వం మేడీజీ' అని భ్రమపడుతున్నారు కొందరు. మంచి నానీ రాయడం అంత సులభమేమీ కాదు. ఉత్కటమైన భావశబలత, సాంద్రత ఉంటే తప్ప దూసుకుపోయే నానీ పుట్టదు. ఏ ధోరణిలోనైనా తప్పొ, తాలూ వుంటాయి. వాటిని బట్టి మన తీర్పు ఉండకూడదు.

చెన్నప్ప నానీల ప్రపంచంలోకి ప్రవేశిస్తున్న బలమైన నానీకారుడు. అతనికి నా హృదయపూర్వక స్వాగతం.

నా మాట

ముత్యాలసరాలు గురజాడ సృష్టి. నానీలు డా॥ ఎన్. గోపిగారి సృష్టి. ముత్యాలసరాలకూ, నానీలకూ వాటివాటి ఆవిర్భావకాలాలకు మధ్య గల అంతరం సుమారు తొంబై సంవత్సరాలు. లోకంలో ఓ మంచిపని జరగడానికి చాలా సమయం పడుతుందనడానికి ఇదొక నిదర్శనం.

ప్రతిభగల కవి వస్తువులోను, ఛందస్సులోను ఎప్పుడూ కొత్తదనం కోసం అన్వేషిస్తాడు. తెలుగు సాహిత్య జగత్తులో కవిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకొన్న గోపి గారికీ ఈ అన్వేషణ తప్పలేదు. కాని వారి తపస్సు ఫలించింది. ఈ దశాబ్దిలో వారి 'నానీలు' ఒక నూతన ప్రక్రియగా సాహితీలోకాన్ని ఒక ఊపు ఊపాయి. ఎలాంటి భావమైనా 20-25 అక్షరాల్లో నాల్గు పాదాల్లో ఒదిగిపోయే తీరును చూస్తే ఈ ప్రక్రియ గొప్పతనం ఏమిటో తెలుస్తుంది.

చమత్కార జనకంగా మాట్లాడడం నాకున్న అలవాటు. మహాకవి గోపి గారు నన్ను నానీలవైపు నడిపించడానికి అదే కారణం. తెలుగులో ఇంతవరకు సుప్రసిద్ధ కవుల కలాల నుంచి జాలువారిన నానీలు విశ్వరూపాన్ని ప్రదర్శించడం సామాన్యవిషయం కాదు. నానీల ప్రత్యేకత ఏమంటే మొదలుపెట్టిన తర్వాత రాయకుండా ఉండలేకపోవడమే.

"కవీ!/ కలం, కాగితం దగ్గరే వుంచుకో/ ఎప్పుడైనా/ 'నానీ' రావచ్చు." అని నాకు నేనే చెప్పుకోక తప్పలేదు.

మల్లిపదాలు (కూనలమ్మ ఛందస్సు) రచించిన పాతిక సంవత్సరాలకు నానీలు రాయడం నాకొక కొత్త అనుభూతి. నన్నొక బలమైన నానీకారునిగా గుర్తించిన డా॥గోపిగారికీ ఈ కృతిని ప్రేమతో స్వీకరిస్తున్న మిత్రులు శ్రీ పి. నరసింహులుగారికీ నా కృతజ్ఞతలు.

నా మనుమరాలు శ్రేష్ఠను దృష్టిలో పెట్టుకొని ఇందులో ఒక నానీ రాశాను. ఆమె ఫొటో కవర్ మీద వుండడం నాకెంతో సంతోషాన్ని కల్గిస్తుంది.

కొన్ని రకాల పూలు కొన్ని ఋతువుల్లోనే పూస్తాయి. కాని నానీలు అన్ని ఋతువుల్లో పూసే అద్వితీయ కవితాకుసుమాలు. వాటి పరిమళాలను ఆఘ్రాణించవలసిందిగా సహృదయులను కోరుతున్నాను.

-మసన చెన్నప్ప

శ్రావణపౌర్ణమి
19-8-2005

కవిత అంటే
కలత రేపేది కాదు
ధైర్యానికి
చిగురు తొడిగేది !

నోరు
చేదుగా వుందని బాధపడకు
కాస్త
వేపాకు నములు.

కడుపులో వున్నప్పుడు తంతే
బాధ లేదు
బయట వుండి తంతేనే
నరకం!

చైతన్యమంటే
కదలిక కాదు
ఉపనిషత్తులనడుగు
జ్ఞానమంటాయి.

ప్రాణాలను
పదిగా గుర్తిస్తాం
కాని
ప్రాణశక్తిని అంచనా వేసేదెవ్వరు?

చెక్కీ చెక్కీ
చిక్కిపోయాడు
అందువల్లే కదా
శిల్పానికి ఆకృతి !

శబ్దం
బ్రహ్మపదార్థం కాదు
ఈశ్వరసృష్టిలో
అదొక భాగం.

ఊరికే
దేవుడినెందుకు పుట్టిస్తారు?
అతనికి
వేరే పనిపాటా లేదా !

ఎంతకాలం
మాటలతో కోటలు కడతావ్?
నీవున్నది మాత్రం
అద్దె యింట్లోనే !

భూతమంటే ప్రాణి
దయ్యమంటే దైవం
కాని
ఇప్పటి అర్థాలు అనర్థాలు.

మా మీద
మాటలు కురిపిస్తావ్
నీ ప్రతాపాన్ని
మబ్బుల మీద చూపరాదూ !

ప్రేమికులు
ఎండలో మాట్లాడుకుంటున్నారు
ఎండ
వారి జోలికి వెళ్లదు.

ఇల్లొకటుందని
విర్రవీగాలా?
అద్దెకైతే
ఎన్ని కొంపలో !

ఆ పోస్టర్ని
అదే పనిగా చూస్తున్నాడు
ఆఖరి బస్సు పోయి
అరగంటైంది.

అతడు నిన్ను
తెలియక బాధపెట్టాడు
నువ్వో
తెలిసి బాధపడాలా?

మిత్రుడు
కారాపలేదని బాధపడకు
బహుశా
నడవమంటున్నాడేమో !

నీ యింట్లో
లైటారిపోయింది సరే
ఎదురింట్లోకి
తొంగిచూస్తావెందుకు?

కొడుకు
బొంగరంలా తిరుగుతున్నాడు
జాల ఏమిటి?
నిరుద్యోగం.

భావకవిత్వాన్ని
ఈసడిస్తావేమి?
ముదరకముందు
శ్రీశ్రీ అంతే !

సాహిత్యానికి
నిర్వచనాలా?
లోతుల్లోకి వెళ్లు
అర్థం తెలుస్తుంది నీకే.

భయపడేవాడు
ఈత కొట్టలేడు
ముందు నేర్చుకునేవాణ్ని
నీళ్లల్లో తోసెయ్ !

వేళ్లు
నాలో భాగమే
మట్టి అంటుకుందని
ఎలా నరుక్కుంటాను?

బడాయి చాలు
తేడా ఏముంది మనకు?
నువ్వు స్టేట్స్‌లో వుంటే
నేను స్టేట్‌లో.

బడా వ్యాపారం
రాజకీయమే
దానికి పెట్టుబడి
అబద్ధాల చిట్టాయే.

కారుందని
కాళ్లు పక్కన పెట్టావా?
నడవడానిక్కూడా
పనికి రావు.

చెట్టు
నాకు ప్రియురాలు
ఆకులతో మాట్లాడుతుంది
పువ్వులతో నవ్వుతుంది.

ప్రేమ
భగ్నమైందని శోకిస్తావెందుకు?
అసలు భగ్నమైంది
గుండె కదా !

పొద్దుటి నుంచి
ఒకటే వాగుడు
చెవులకు
తాళాలు దొరికితే బాగుండు!

నింగీ, మనసూ
రెండూ అర్థం కానివే
ఒకటి ఎత్తైతే
రెండోది మరీ లోతు.

ఇప్పటి దాకా
ఎంత దూరం నడిచానో !
ఇంకా
గమ్యాన్ని చేరుకోలేదు.

పల్లెలు
పట్నాలుగా మారుతున్నాయి
మరి
పట్నాలు ఏమౌతున్నాయో !

కోతి నుంచి
మనిషి వచ్చాడా?
పాపం
కోతికెంత అవమానం !

వెంట్రుకవాసిలో
ప్రమాదం తప్పిందట!
మరి
రక్షించిందెవరో గ్రహించావా?

ఆకాశం
అవతలికి చూశాను
అక్కడా
ఆకాశమే కనిపించింది.

అమెరికా అమెరికా
అంటారేమిటి?
నాకు కావలసింది
అమరిక.

తానాకెళ్లి
తందానా అనాలని లేదు
ఆటాకెళ్లి
ఆడాలనీ లేదు.

గుండె విప్పి
మాట్లాడమంటారు
అందరికది
సాధ్యమవుతుందా?

సన్యాసం
స్వీకరిస్తావా?
అంటే నీకు
మనుమరాలు లేదన్నమాట!

బయట
అంతా శోకమే
అంతర్ముఖుడివి కా
శాంతి సముద్రాల ఉత్సేకమే.

పెద్దవాడినై పోయానని
ఎందుకా పొగరు
ఓసారి
బాల్యంలోకి వెళ్లిరా.

మనసు
పెరుగులాంటిదే
మజ్జిగగా మార్చు
నలుగురికి పనికొస్తుంది.

రాక్షసులకు
నిలయమంటావా లంకను?
మరి విభీషణుని
మాటేమిటి?

నీకు ధర్మం తెలిస్తే
అప్పుడు
మతం కంటె
మనిషినే ప్రేమిస్తావు

అద్వైతీ అద్వైతీ
అంటావు
మరి
ఇంకెందుకు వేంకటపతి !

వాన రాకపోతే
కన్నీరా?
జాగ్రత్త
అవి కూడా అయిపోయేను.

మనం గెలవదలచింది
మృత్యువైతే,
చేరగలిగింది
మోక్షం.

కాగితం
గాలికి ఎగిరిపోతుంది
అక్షరాలు మాత్రం
అలాగే వుంటాయి.

ముహూర్తం లేదని
పిల్ల పెళ్లి ఆపుతావా?
మంచి సంబంధం
మళ్లీ రావాలిగా.

మీ ఇంట్లో
ఒక్క పాపా లేదా?
అయితే
పూలమొక్కను పెంచుకోండి.

అమృతపుత్రులమని
వేదం.
పాపులంటారేమిటి
ఇదెక్కడి వాదం?

ప్రపంచమంతా
పాపులతో నిండిపోతే
స్వర్గానికి
చోటెక్కడ?

ముట్టుకుంటే
రోగాలు నయమౌతాయా?
ఇదెక్కడి
స్పర్శ సిద్ధాంతం !

సూటూ బూటూ
వద్దన్నానా?
సూటిపోటి మాటలే
మంచివి కాదన్నాను.

ఎందుకో మతాలు
విజృంభిస్తున్నె
దైవచింతనా?
కాదు, స్వార్థచింతన.

కొబ్బరికాయ కొడితే
నీరు పోతుందేమో కాని
పాపాలు
క్షాళితమౌతాయా?

గుండెలో వున్న దేవుణ్ణి
మొదట గుర్తించు
బండలో
ఆ తర్వాత.

కేశాలు
తొలగించుకున్నంత సులభంగా
క్లేశాలు
తొలగిపోతాయా !

లోపల ఒకటి
బయట ఒకటి
మేడిపండు గురించి
ఎవరికి తెలియదు?

మంచి పనికి
పట్టుదల చూపమంటే
నీవు
తల పట్టుకుంటావేమిటి?

లోకంలో
అందరూ బతికేస్తారు
కాని కొందరు మాత్రమే
జీవిస్తారు.

ప్రజలు
భద్రంగా ఉండాలా?
ముందు నాయకులకు
భద్రత కల్పించండి.

మీకు సన్మానాలు
కావాలా?
వెంటనే
భాగ్యనగరం బండెక్కండి.

అధికారంలోకి రాగానే
యాక్షన్.
మరి ప్రతిపక్షంలో వుంటే
ఫ్యాక్షన్.

దయచేసి
ఇంటినెంబర్ అడక్కండి
సెల్లు నెంబరైతే
ఇస్తాను.

లోకంలో
ఆకలి చచ్చేదాకా
ఆకలిచావులు
తప్పవా మరి!

నడుం కట్టి
నడవరా అంటే
బట్టపేలిక
నడుముకి చుడితే ఎలా?

నిజంగా నీకు
కళ్లుంటే
గులాబీ రేకులే కాదు
ముళ్లూ కనిపించాలి.

కావ్యకర్తనని
గర్వపడతావుగాని
ముందుగా
వాక్యం రాయడం నేర్చుకో.

తల్లికి
బిడ్డలంటే ఎంత ప్రేమో
భూమికి
చెట్లు కూడా అంతే.

అతన్ని
అమాయకుడంటావా?
మరి
లోపలి రాక్షసుడి సంగతి !

చుక్కల్లోకి
ఎగిరిపోవాలని ఉందా?
ఇంకేం
ఒక చుక్కేసుకో !

అతనికి తెలిసింది
పరుగుదీయడం
మరి నాకో
గమ్యం.

నేటి కవిత్వానికి
లక్షణమా?
కవికి కూడా
అర్థం కాకపోవడమే.

తలకాయ పగిలితే
ఏమొస్తుంది?
కొబ్బరికాయ అయితే
కొబ్బరా, నీళ్లు.

వాదం వల్ల
ఒరిగేదేముంది?
వేదం వల్లనైతే
జ్ఞానమన్నా పెరుగుతుంది.

కోడల్ని
బాధపెడతావెందుకు?
కూతురు
సుఖపడాలని లేదా?

దూషించడం
మానలేనని అంటావా?
అయితే
మాట్లాడటమే మానెయ్.

ఏమి రుచి
ఆ పదార్థంలో!
ప్లేటునే
తినెయ్యాలనిపిస్తుంది.

నిజంగా అతడు
నివురుగప్పిన నిప్పే
తాకితే గాని
తెలిసిరాలేదు.

తలుపులు మూస్తే
నాకిబ్బంది లేదు
కాని కిటికీలు మాత్రం
తెరిచే వుంచు.

ఇక్కడ
పంచె కట్టుకుంటేనేం?
అక్కడ మాత్రం
సూటూ బూటు వేసుకోవచ్చు.

కవీ!
కలం, కాగితం దగ్గరే వుంచుకో!
ఎప్పుడైనా
'నానీ' రావచ్చు.

పిడుగులు పైబడ్డా
అడుగులు తడబడలేదా
ఐతే నువ్వు
వీరుడివి!

ఏడడుగులే కదా
అనుకోకు
అది ఏడేడు జన్మల
అనుబంధం.

గజ్జె కట్టగానే
ఐపోతుందా?
ఎదుటి గుండెల్లో
ధ్వనులు ప్రతిధ్వనించాలి.

కళ్లకేమి?
బాగానే ఉంటాయి
కాని చూపుల గురించే
బాధ.

కళ్లల్లో పడడం
చాలా సులభం
మనసుకెక్కాలనుకోవడమే
కష్టం!

పరీక్షల్లో
ఫెయిలయ్యావా?
ఇంకేం
రాజకీయాల్లో పైకొస్తావు.

నువ్వు ఒంటరివని
ఎవరన్నారు?
పరమాత్మ
నీతో ఉన్నాడుగా.

నేను
పల్లకీలో కూర్చున్నాను
బోయీలను
మర్చిపోతానా.

మేఘమథనం వల్ల
మేలెవరికి?
వర్షేష్టిని
మరిచిపోయారా?

నేను
కష్టాల్లో ఉన్నాను
ఈ దెబ్బతో
మిత్రులెవరో తేలిపోతుంది.

మనిషి సహజంగా
మంచివాడు.
మనసందుకే
మంచిని ప్రోత్సహిస్తుంది.

కలిసొచ్చేవారు లేరని
కలతెందుకు?
ఆ చొరవేదో
నువ్వే చూపొచ్చుగా.

చెట్టెప్పుడూ
గతాన్ని తవ్వుకోదు
ఎప్పటికప్పుడు
చిగిర్చడం దాని పని.

అతన్ని సన్మానిస్తే
నష్టం లేదు నాకు
ఈ శాలువా
అతడు కప్పిందే.

బాధ పెట్టడానికి
క్షణం పట్టదు
మరి
పోగొట్టడానికి ఎన్ని యుగాలో !

కళ్లయితే
మూసుకుంటాం కాని
మనసుకు
మూతపడుతుందా?

సృష్టి రచన
ఏం బాగుంది?
అంత పెద్ద ఆకలికి
ఇంత చిన్న నోరా!

బంగారు నగలే
ధరించాలా?
మనసే
బంగారమైనప్పుడు!

ఒకరి మీద
మరొకరు అధికారి.
వారిలో
సంస్కారి ఎవరో చెప్పండి?

బ్రాహ్మణుడే
వేదం చదవాలా?
మొదట
చదివితే గదా బ్రాహ్మణుడయ్యేది !

ఏమి
సెక్యులర్ దేశమండి?
రోడ్డు మీదే మసీదులూ
చర్చీలూ, దేవాలయాలు!

ఏ మంచి పని చేసినా
అడ్డుకుంటావెందుకు?
నువ్వే చేసి
చూపించకూడదూ!

నగరంలో
రోడ్ల మీద మ్యాన్‌హోల్స్
వ్యవస్థకు పడిన
కన్నాలు.

ఎంతో
ఎత్తుకెదిగావని అహం!
పైకి చూడు
చుక్కలున్నాయి.

కళ ఒక సముద్రం
ఒడ్డునే గొణుగుతావేమి?
ఐతే దొరికేవి
గవ్వలే.

మంచి వక్తవని
నీ భావన
ఎందుకైనా మంచిది
సినారెని విని చూడు.

వృత్తుల మీద
కత్తులు దూయకు
యంత్రాలకు
చింతకాయలు రాలవు.

నాస్తికునికి
దేవుడే లేడు
ఆస్తికునికా దేవుడు
అర్థమే కాదు.

ఒకసారి తప్పు చేస్తే
ఒప్పుకోవచ్చు
మళ్లీ మళ్లీ చేస్తే
మాఫీ లేదు.

సంస్థల్ని
రేపు పెట్టుకోవచ్చు
ఇవ్వాళ మాత్రం
అడ్వాన్స్ చెక్కులిచ్చేయండి !

వశిష్టుడి పేరుతో
మోసమా!
అయితే
విశ్వామిత్రుడే నయం.

ప్రయత్నిస్తే
వచ్చేది విద్య
ప్రయత్నించకుండానే వచ్చేది
నిద్ర.

అంతా బాగుంటేనే
అర్ధాంగి
దెబ్బ తగిలిందా
'అమ్మా' అంటాడు.

పర్సు
చూడముచ్చటగా వుంది
అందుకే గదా
దొంగకు కన్ను కుట్టింది!

ఒకడు
ఓడితేనే గదా
మరొకడు ఎప్పుడైనా
గెలిచేది!

చుక్కలు ఆకాశంలో
పక్కకు తప్పుకుంటున్నాయి
పాత చంద్రుడే
సిగ్గెందుకు!

రోడ్ల మీద
ఈత కొట్టాలని వుందా!
అయితే ముంబాయికి
బయల్దేరండి.

దీపాలను
ఆర్పడం తప్పా?
అయితే పుట్టినరోజున
చేస్తున్నదేమిటి?

ఓ నా ఫస్టు తారీఖా!
భళా!
నిన్న జేబులు ఖాళీ
ఇవ్వాళ క్లబ్బుల్లో కేళీ.

ఒక చీర కొంటే
మరో చీర ఉచితం
పర్సుకు మాత్రం
వస్త్రాపహరణం.

నిజమే మరి!
దేహం కంటే బుద్ధి గొప్పది
మరి
ఆత్మబలం !?

ఆ నాయకుడు
ఇక మాట్లాడలేడట!
బహుశా
వాగ్దానాలు అయిపోయాయి!

సిరాచుక్క
సంతోషించింది
పెన్నులో ఉన్నందుకు కాదు
అక్షరమైనందుకు.

వేదం
అందరి కోసం
కొందరికే అనడం
సంకుచిత వాదం.

పెద్ద బస్సే ఎక్కావు
కాదనను
కాని నడిపేది
చిన్న డ్రైవరే.

గాలిలో
దీపాన్ని బెట్టి
మీ ఇలవేల్పును
ఎందుకు బాధపెడతారు?

బురదనేల కదా అని
బాధపడకు
అడుగున
గంగమ్మ దాగున్నది.

కొత్త కారు కొనమని
ఫోను మీద ఫోను
కారు మీద కారు
పెట్టలేం కదా!

పిల్లల్ని
అలా కొడతావెందుకు?
నీ బాల్యాన్ని
మర్చిపోయావా?

వరండాలో
నూకలు చల్లలేదు
అయినా
రెక్కలు కట్టుకొని నానీలు.

పాదలేపనం దొరికితే
బాగుండు
వరూధినిని
చూసొచ్చేవాణ్ని.

వాళ్లావిడది
లక్ష్మీస్వరూపమట
ఆఫీసులో
నాల్గు చేతుల సంపాదన!

ప్రజలు
నీ మాటలు నమ్ముతున్నారా?
అయితే
నువ్వు నేతవైనట్లే.

ఇన్ని
డిగ్రీలెందుకు నాయనా?
చెల్లని రూపాయికి
ఎక్కువ గీతల్లా.

నీది వాదమే
నాదీ వాదమే
సర్వేశ్వరునిది మాత్రం
వేదమే.

ప్రకృతి పురుష సంబంధం
సత్యం కాదని
నిత్యమూ చెప్పేది
నిద్ర.

పెదవులపై
నవ్వుల్నే పట్టించుకుంటావ్
గుండె పాదును
మరిచావా?

ఆవేశమే కదా అని
చంపకండి
అది ఆలోచనల
రాకెట్టు కావొచ్చు.

హిమాలయం
ఈ మధ్య కుంగుతుందట
ఏ దుర్మార్గుడి
చూపు పడిందో!

కళ్లజోడు
పోగొట్టుకున్నాను
దొరకాలంటే
మరో కళ్లజోడు కావాలి!

అమ్మను
ఏమన్నా అన్నావంటే నేనూరుకోను
అమ్మంటే
అమృతంరా!

గొప్ప కవిత్వం
అంటే ఏమిటి?
నిత్యనూతనం
సత్యసుందరం!

***